# ప్రేమ గాలిలో దీపాలు

సుధీర్

శలవులలో కొన్ని నెలలపాటు నిశ్చలం గా నిశ్శబ్దంగా, ఉన్న కాలేజీ చిగురించిన చెట్టులా కళకళ లాడుతోంది. వానలు కురిసే తొలిరోజుల్లో సెలయేళ్ళ నుంచి నదులలో ప్రవేశించే చేపపిల్లల్లా క్రొత్త విద్యార్థులు కాలేజీలో ప్రవేశిస్తున్నారు. కాలేజీ ఆవరణలో నిలబడి గాలికి ఊగే అశోకవృక్షాలు కాలేజీలో ప్రవేశించే క్రొత్త విద్యార్థులందరినీ పరికించి చూస్తూ వాళ్ళ అభివృద్ధిని ఆశిస్తూ ఒక్కొక్కరినీ ప్రత్యేకంగా ఆశీర్వదిస్తున్నట్లనిపిస్తోంది. కాలేజీ పాతదయినా ఎంతో క్రొత్తగా తోచింది కళ్యాణికి. క్రొత్త పాతలు కలిసిన వింత అనుభూతి ఎంతో ఆనందాన్నిచ్చింది ఆమెకు. పాత స్నేహితులే అయినా వారిలో కలిగే నూతన భావాలు ఆమె హృదయానికి ఎంతో ఆహ్లాదాన్నిచ్చాయి. క్రొత్త క్రొత్త విషయాలతో నెల రోజులు గడిచిపోయాయి.

* * *

"గణ గణ" కాలేజీ బెల్ మ్రోగింది. స్టూడెంట్సందరూ గలగలమంటూ ఎవరి క్లాసుల్లోకి వాళ్ళు వెళుతున్నారు. కళ్యాణి తనక్లాసే అయిన రూపతో కలిసి తెలిసిన వాళ్ళింట్లోనే ఒక ప్రక్క గదిలో అద్దెకుంటోంది. రూమ్ తాళంవేసి క్లాసుకు కదిలింది కళ్యాణి. మధ్యలో రఘు కనపడి "మీ Botany notes ఒకసారి కావాలండి. మళ్ళీ రెండ్రోజుల్లో ఇస్తాను" అన్నాడు. "ఇవాళ ఆ అవర్ లేదు కదండీ అందుకని తేవటం లేదు.... మా రూమ్‌కి రండి ఇస్తాను" అంది. క్లాసు వేపు నడుస్తున్న కళ్యాణి దూరంగా ఎవరో ఎంతసేపైనా తనని తదేకంగా చూస్తున్నట్లు గమనించింది. క్లాసులో పాఠాలలో మనసు నుంచలేకపోయింది. కళ్యాణి "ఎవరతను? ఎందుకలా చూస్తున్నాడు అన్న ప్రశ్నలామెను వేధిస్తున్నాయి. లాంగ్‌బెల్‌తో ఉలిక్కిపడిన కళ్యాణి పుస్తకాలు తీసుకొని క్లాసు బయటకు నడిచింది. కొద్ది దూరంలో చెట్టు క్రిందనిల్చొని మళ్ళీ తననే చూస్తున్న ఆ వ్యక్తిని చూసింది. అతనూ ఒక విద్యార్థే. అయినా కళ్యాణికి కొంచెం భయం వేసింది. అందుకే మధ్య మధ్య వెనక్కి తిరిగిచూస్తూ త్వరత్వరగా రూమ్ వేపు నడిచింది.

మర్నాడు మధ్యాహ్నం మెస్‌నించి వస్తున్న కళ్యాణికి తన రూమ్ దగ్గర నుంచున్న రఘు కనిపించాడు. తాళం తీసి షల్ఫ్‌లోంచి Botany notes తీసుకొచ్చి అతనికిస్తూ మళ్ళీ తన ఇంటి వేపు చూస్తున్న ప్రొద్దుటి వ్యక్తిని చూపిస్తూ "రఘూ! అతనెవరండి" అనడిగింది. "అతనా శేఖర్ అని మనకాలేజీకి క్రొత్త స్టూడెంటు. మొన్ననే జాయిన్ అయ్యాడు" అన్నాడు తాపీగా. కానీ ఆమెకు మాత్రం రెండ్రోజులుగా ఆ శేఖర్ తననలా వెంటాడటం ఏదోలా అనిపించింది. మర్నాడు రూమ్‌నించి కాలేజీకి వెళ్ళే దారిలో నెమ్మదిగా నడుస్తోంది కళ్యాణి "ఏవండీ" అన్న గొంతు వినపడి ఉలిక్కిపడి చూసింది. ప్రక్కన శేఖర్.


ఒక్క క్షణం ఆమె గుండెలు దడదడలాడాయి. ఒక్కసారిగా జరిగిన ఈ హఠాత్సంఘటనకు ఆమె భయపడి "ఊ" అంది నెమ్మదిగా. "మీతో కొంచెం మాట్లాడాలి". చటుక్కున తలెత్తి చూసింది. మొహాన స్ఫోటకపు మచ్చలతో వికృతంగా ఉన్న అతనిని చూడగానే అసహ్యంతో భయంతో ముచ్చెమటలు పోశాయి. అతనికేమీ సమాధానం చెప్పకుండానే గబగబా క్లాసుకి వెళ్ళిపోయింది. మళ్ళీ మర్నాడుకూడా శేఖర్ తనవైపు నడుస్తూ రావడం గమనించిన కళ్యాణి తప్పించుకోవాలని అతన్ని చూడనట్లు వెళ్ళిపోవడానికి శతవిధాల ప్రయత్నించి విఫలమైంది. కొంచెం భయంతోనూ, కోపంతోనూ మీరిలా మాటిమాటికీ నన్ను వెంటాడటం ఏమీ బాగా లేదండి. అనేసి దాదాపు పరుగెత్తుతున్నట్లుగా వెళ్ళిపోయింది. రూమ్ కొస్తున్న కళ్యాణి దారిలో శేఖర్‌ని చూసి స్నేహితులకోసం అటూ ఇటూ చూసింది. కానీ వాళ్ళంతా అప్పటికే వెళ్ళిపోయారు. రెండు మూడు రోజులనుంచీ క్లాసులలో పరధ్యానంగా ఉంటున్నందుకు madam నుండి వార్నింగ్ తీసుకొనివచ్చేసరికి తనకి కొంచెం ఆలస్యమయింది. "ఇప్పుడెలా?" దీర్ఘంగా ఆలోచించిన ఆమె ఒక నిర్ణయాని కొచ్చింది. "ఇతనెవరో రౌడీలా ఉన్నాడు కాబట్టి మంచి మాటలతో వినేరకం కాదు. ప్రిన్సిపాల్‌కి రిపోర్టివ్వాలి" అనుకొని అడుగులు ముందుకు వేసింది.

"దయచేసి మీరు సావకాశంగా వింటే కొన్ని విషయాలు చెబుదామనుకుంటున్నాను" అన్నాడు శేఖర్. "మీరేమీ చెప్పనక్కరలేదు. నేనేమీ వినక్కర్లేదు." అని వెళ్ళిపోతున్న ఆమెను అతను వారించి "మీరేమీ అనుకోనంటే ఒక్క విషయం చెబుతాను. మిమ్మల్ని నేను...." ఇంక అతనికి అవకాశమివ్వకూడదని నిర్ణయించుకొన్న ఆమె అతనివైపు కొరకొరా చూస్తూ వెళ్ళిపోయింది.

* * *

ప్రిన్సిపాల్‌గారి దగ్గర్నుంచి కబురొచ్చిందన్న విషయం తెలిసిన వెంటనే కళ్యాణిని ఆయన రూమ్‌లో చూడగానే జరిగినది అతనికి అర్థమైంది.

"ఆమె ఎవరో నీకు తెలుసా? తెలిస్తే అలా ప్రవర్తించి ఉండవు. పాత విద్యార్థివైతే నీ క్రితం సంవత్సరాలలోని క్యారె




క్టర్‌నిబట్టి క్షమించడమో లేక తాత్కాలికంగా సస్పెండ్ చేయడమో చేసేవాణ్ణి. ఆ అమ్మాయి అంత ఓపిక వహించినా నీ చెడు ప్రవర్తనతో ఆమె నాకు రిపోర్టిచ్చేలా చేశావు. నీలాంటివాళ్ళకు ఈ కాలేజీలో స్థానం లేదు. "you are dismissed". ప్రిన్సిపాల్‌గారి కంఠం ఉరుములా వినిపించి అతని తలపై పిడుగు పడినట్లనిపించింది. ఏదో చెబుదామనుకొన్న శేఖర్‌కు "Get out" అని వినిపించి వెనుదిరిగాడు. కనీసం కళ్యాణికయినా చెబుదామని తలెత్తేసరికి ఆమె అక్కడలేదు.

* * *

"టక టక" తలుపు శబ్దంతో కళ్యాణి నిద్ర చెదిరిపోయింది. ఆమె లేచి తలుపు తీసింది. ఎదురుగా శేఖర్.

"ఇంకా సిగ్గులేదా" గర్వంగా నిర్లక్ష్యంగా పలికింది ఆమె కంఠం. "ఈ లెటర్ మీకిచ్చి వెళదామని" అన్న అతని దగ్గరనుంచి ఆ కవర్ లాక్కొని మొహాన కొట్టి "ఎంత పొగరు" అని తలుపేసింది. జరిగిన ఘోర అవమానానికి తల భారంగా అనిపించింది. మెల్లగా అక్కడినించి కదిలాడు. అతడు అనుకున్నదొకటి. అయిందొకటి. కళ్ళు తిరుగుతున్నాయి. తూలుతూ మెల్లగా రోడ్డెక్కి ఇంటిదారి పట్టాడు.

* * *

"కళ్యాణీ! కళ్యాణీ"! బయటినుంచి రూప కంఠం వినిపిస్తోంది. కళ్యాణి నిద్రలేచి తలుపుతీసింది. "ఏమిటే! ఏదో మధ్యాహ్నం క్లాసు లేకపోతే ఒక గంట, అంతేగాని రోజంతా నిద్దరేనా ఏమిటా మొద్దు నిద్దర. అది సరేగానీ నీకో అన్నయ్యున్నాడని నాతో ఎప్పుడూ చెప్పలేదేం? అదికూడా దాచాల్సిన విషయమేనా" అంది రూప. "అన్నయ్యేవిటీ" "నిద్రమత్తు వదిలించుకుంటూ ఆశ్చర్యంగా ప్రశ్నించింది కళ్యాణి. "మరి ఈ లెటర్ ఎవరు రాశారో" అంటూ రూప ఇచ్చిన కాగి

తాన్ని తీసుకొని చదవడం మొదలు పెట్టింది కళ్యాణి.

కళ్యాణికి,

చెల్లీ,

మాదొక పల్లెటూరు. మా ఊళ్లో కూడా చిన్నప్పటినుంచీ నాకు స్నేహితులెవ్వరూ లేరు. నా చెల్లెలుతోనే ఆడుకొనేవాణ్ణి. కలిసే స్కూలుకు వెళ్ళేవాళ్ళం. నా చెల్లి అంటే నాకు ప్రాణం. ఆమెను ఒక్కక్షణంకూడా విడిచి ఉండలేకపోయేవాణ్ణి. అలాగే ఎంతో ఆప్యాయంగా పెరిగి పెద్దవాళ్ళయ్యాం. కానీ క్రిందటేడు మా ఊరిపై రాకాసిలా విరుచుకుపడ్డ మశూచికం నా చెల్లిని నాకు దూరం చేసింది. అనుక్షణం గుర్తొస్తున్న ఆ బాధను మరిచిపోవాలనే ఈ ఊరొచ్చి కాలేజీలో చేరాను. వచ్చినరోజే నిన్ను చూసి ఆశ్చర్యపోయాను. నా చెల్లెలు బ్రతికే ఉందనుకున్నాను. కాని నా కళ్ళ ముందే బూడిదై పోయిన చెల్లి జ్ఞాపకం రాగానే కనీసం అటువంటి ఆప్యాయత నీనుండి ఆశించవచ్చుననుకొన్నాను. నిన్ను చెల్లీ అని పిలవాలనుకొన్నాను. అందరి హృదయాల్లో నేనీనాడు ఒక నీచుడిగా చిత్రింపబడి ఉండవచ్చు. కానీ ఎప్పటికైనా నువ్వయినా నన్ను అర్థం చేసుకుంటావని ఆశిస్తున్నాను. ముఖంలో మచ్చలు చూశాక మనస్సు అర్థం చేసుకోవడానికి ఎవరు ప్రయత్నిస్తారు? ఆవేదన ఆలోచనలతో ఇక్కడ ఉండలేక మా ఊరెళ్ళిపోతున్నాను.

ఇట్లు నీ అన్నయ్య,
శేఖర్.

జరిగిన పొరపాటును గ్రహించిన కళ్యాణి వేగంగా ప్రిన్సిపాల్‌గారి రూమ్ వైపు పరుగెత్తింది. "కళ్యాణీ ఏమిటే? ఏం జరిగింది? అని అరుస్తున్నా అప్పటికే వినబడనంతదూరం పరిగెత్తిన ఆమెవేపు వింతగా చూస్తూన్న రూప కళ్యాణి రూంకి తాళంవేసి ఆమె వెళ్ళిన వైపే బయల్దేరింది.

అసలు విషయాన్ని చెబుదామని ప్రిన్సిపాల్‌గారి దగ్గరికి వెళ్తున్న కళ్యాణికి కాలేజీ గేటు దగ్గర జనం మూగి ఉండటం కనబడింది. ప్రిన్సిపాల్ గారు రూమ్‌లో లేరు. ఆ గుంపుదగ్గర నిలబడి ఉన్నారని ప్యూన్ చెప్పడంతో అటువైపు పరుగెత్తింది కళ్యాణి. గుంపును చేరి ప్రిన్సిపాల్‌గారి కోసం అటూ ఇటూ చూస్తూ రోడ్డు మధ్యలో రక్తపుమడుగులో పడిఉన్న శేఖర్‌ని చూసి స్తంభించిపోయింది. "తాగాడో, ఎండకి కళ్ళు తిరిగాయో తూలుతూ నడుస్తున్నాడు రోడ్డుమీద. ఇంతలో లారీవచ్చి గుద్దేసింది" దగ్గర్లోఉన్న కిళ్ళీకొట్లవారి సాక్ష్యాలు ఆమె చెవిని సోకలేదు. ఏం జరిగినా శేఖర్ ఇక లేడు. కరుడుకట్టిన ఆ హృదయం నిశ్చలంగా ఉండిపోయింది. విధికి ఎదురాడే మానవ ప్రయత్నాలు మంటగలిశాయి. జీవిపోయిన ఆ శరీరంకేసి చూస్తూ అచేతనంగా కూలబడిపోయింది కళ్యాణి.

★